# శ్రోతాకోక చిలుకలు

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

మా 'శ్రీకాకుళం' కౌన్సిలరుగా నిలబడాదని విని మొదట నేను నమ్మలేదు. ఇదేదో పౌరబాటనీ ఏ శ్రీకాకుళమో నిలబడితే ఇతనే అన్నారనీ అనుకున్నాను. కానీ 'నిర్లక్ష్యం' కనిపించి ఆ నిలబడింది మన శ్రీకాకుళమే అని చెప్పడంతో నాకు ఆశ్చర్యంతోపాటు వాడి మీద అసహ్యంకూడా వేసింది.

"ఏమిటి వీడి ధైర్యం? ఇదేం కుళాయి గట్టెక్కి ఉపన్యసించడం. కిళ్ళీ కొట్టుదగ్గర తీర్పులు చెప్పడం అనుకున్నాడా?" అని 'నిర్లక్ష్యాన్ని' ప్రశ్నించాను.

"ఏమో; ఎవరు చెప్పినా వింటేనా? నువ్వుకాకపోతే మరొకడు నా పేరు ప్రతిపాదిస్తాడని మొండిగా మొదలెడితే

ఏంచెయ్యను ?" అన్నాడు 'నిర్లక్ష్యం'.

"ఏమిటి ?... వాడిని నిలబెట్టింది నువ్వే నేవిటి ? ఏడిసినట్టుంది. ఆ చవటకి బుద్ధిలేకపోతే నీ కేవయింది ?" అన్నాను.

"ఏమో ! ఆ విషయం నన్నుకాదు వాణ్ణేఅడగు" అని నిర్లక్ష్యం విసవిసా వెళ్ళిపోయాడు ...

ఆ సాయంత్రం శ్రీకాకుళాన్ని వాళ్ళ ఇంటిదగ్గర కలుసుకున్నాను. నన్ను చూసి కంగారుపడ తను చేసిన పని సిగ్గుపడతాడని ఊహించానేగాని, వాడిలో ఆ చేష్టలేమీ కనిపించకపోవడంతో చకితుణ్ణయ్యాను. పైగా మిక్కిలి అతి ప్రశాంతంగా 'కూర్చో" అని మాత్రం అని మౌనంగా దేన్నిగురించో తీవ్రంగా ఆలోచించసాగాడు.

కొంతసేపయాక "కౌన్సిలరుగా నుంచున్నావట. నిజమేనా ?" అన్నాను.

అంగీకారసూచకంగా తల ఊపాడు.

"ఏమిటి నీ ధైర్యం ?" అన్నా.

సమాధానం చెప్పకుండా మందహాసం మాత్రం చేసి ఊరుకున్నాడు. నాకు ఒళ్ళు మండింది నాలుగు చీవాట్లు పెట్టి వాణ్ణి మాన్పిద్దాం అనే ఉద్దేశ్యంతో ఇలా అన్నాను.

"అప్పుడు వాళ్లకి తప్ప ఇంకెవరికీ తెలియని అనామక శిఖామణివి నీకు కౌన్సిలరయ్యే పలుకుబడి ఏమి ఏడిసిందరా. డబ్బయినా దండిగా ఉందా అంటే సెకండ్‌హాండ్ కరింబీడీకే నీదగ్గర ఉండదం గగనం చదువుమాట సరేసరి పోనీ పెర్సనాలిటీ అయినా లేదు. ఎవరైనా వింటే నవ్విపోతారు. ఈ పాటికయినా ఉపసంహరించుకో"

నా మాటలేవీ వాడి చెవికెక్కినట్లు లేదు ఒక్కక్షణం ఆగి చేతిసంచీలోంచి ఒక కరపత్రం తీసి నాకందిచాండు. లెదర్‌బాగ్ చూచి ఆశ్చర్యంతో "ఇదెప్పుడు కొన్నావ్ ?" అన్నా.

"అది ఈ సంచీ, లాల్చీ, కళ్ళజోడూ, ఆ చేతికర్రా ఇవన్నీ ఒకసారే కొన్నా. నిన్ననే దినపత్రిక్కి కూడా చందా కట్టేశాను" అన్నాడు.

వాడి ఎన్నికల హంగామా చూస్తే నాకు నవ్వొచ్చింది. "పిట్టపిల్లకి దబ్బెక్కడిది" అన్నా.

"సొంత గ్రామఫోను ఉండేదికదూ, అది అమ్మేశా. అదిసరేకాని ముందా కరపత్రం చదువు" అన్నాడు.

అందులో ఆ రోజున బహిరంగసభ అనీ ఉపన్యాసకుడు 'శ్రీకాకుళం' అని ఉంది ఆ సభకి అధ్యక్షుడుగా నా పేరు ఉంది. కరపత్రం క్రింద "శ్రీకాకుళం నిశానీ" అని నిశానీ బ్లాకు అచ్చువేసి ఉంది. ఈ ప్రహసనంలో నా పేరేవిటను కొని 'నేను అధ్యక్షుడుగా ఉండను" అన్నాను,

"ఉండకపోతే బలవంతంలేదు. కాని వార్డునిండా కరపత్రాలు ఇంతక్రితమే

పంచిపెట్టబడ్డాయి" అన్నాడు. 'శ్రీకాకుళం.' నాకు వొళ్ళుమండింది. ఈ పాటికే ప్రజలందరి దృష్టిలోనూనేనుఒక పిచ్చివాడిగా అయివుంటాను, రేపటినుంచి వీధిలోంచి వెళుతూవుంటే "ఫలానా 'శ్రీకాకుళం' సభకి అధ్యక్షుడు"ని నా వెనకాల ప్రజలు అనుకుంటూ నవ్వుకుంటారు, నాకి ఆలోచనతో తేళ్లు జెర్రులూ పాకినట్టయింది. "నా అనుమతి లేకుండా నా పేరు ఎందుకు వేశావ్!" అన్నాను తీవ్రంగా.

'శ్రీకాకుళం' నా చేతులు పట్టుకుని బతిమాలుతూ సభని పాడుచెయ్య వద్దని నా భరోసా చూసుకునే తా నిందులోకి దిగాననీ, అధ్యక్షుడుగా కుర్చీలో కూర్చుంచే చాలు ఇంకేం చెయ్యక్కర్లేదు. అన్నీ తానే చూసుకుంటానని ప్రాధేయపడసాగాడు. సరే చివరికి ఎలాగయితేనేం నేను ఒప్పుకోక తప్పలేదు, తెలిసింది ఎలాగా తెలిసింది. ఇంక కుర్చీలో కూర్చుంచే ఏంపోయిందని అంగీకరించాను

రాత్రి ఎనిమిదింటికి వీధి మొగలో ఒక టేబిలూ రెండు విరిగిన కుర్చీలూ ఒక హరికేన్‌లైటూ శ్రీకాకుళమే సిద్ధపరచి నన్ను అక్కడికి పిలుచుకు వెళ్లాడు. నేను వెళ్ళేటప్పటికి పిల్లలూ, పెద్దలూ కలిసి పది పదిహేను మంది ఉన్నారు. నేను ప్రశ్నార్థకంగా 'శ్రీకాకుళం' కేసి చూశా.

"నువ్వేం జంకకు. కానిచ్చెయ్యి" అన్నాడు.

నేను లోపల్లోపల వినుక్కుంటూ శ్రీకాకుళంగురించి రెండు పరిచయ వాక్యాలు పలికి కూర్చున్నాను. తర్వాత శ్రీకాకుళం లేచాడు.

"ప్రజల్లారా! ప్రజలన్నానని ఆశ్చర్యపడకండి. సోదరులు కానివాళ్ళని ముఖప్రీతికోసం సోదరులారా అనీ, మనస్సులో వేరే ఆలోచనలు పెట్టుకొని పైకి మాత్రం సోదరీమణులనీ అనడం నా కిష్టంలేదు. అందుకే అలా సంబోధించాను. నేను నాయుడుగారి పార్టీవాడనూకాను. పెద్ద కాపుగారి పార్టీవాడనూ కాను. నాకు ఓటు వెయ్యమని మిమ్మల్ని దేవురించను. అయినా నాకు కొన్ని అర్హతలున్నాయి ఆ యోగ్యతల్ని మీకు చెప్తాను. అంతే! మీకు ఇష్టం అయితేనే వెయ్యండి. నేను ఇతరుల సొమ్ము తినెయ్యలేదు. ఎవరి కొంపలూ కూల్చలేదు. ఎవర్నీ మోసం చెయ్యలేదు. ఎవరికీ ఉపకారాలు చేస్తానని శుష్క ప్రమాణాలు చెయ్యలేదు. ఇవే నా అర్హతలు.

నేను మీ వార్డు కేవో ఉపకారాలు చేస్తానని వాగ్దానం చెయ్యడంలేదు. కుల తత్వాలు, పార్టీ తత్వాలులాగే వార్డు తత్వాలుకూడా పరిహరించవలసినవే!"

'శ్రీకాకుళం' కంఠం హెచ్చించి మాట్లాడుతూంటే ఆ వార్డులో జనం ఒక్కొక్కళ్ళే నిద్దరపోతున్నవాళ్లు




కంగారుపడుతూ కళ్ళు నులుపుకుంటూ సభాస్థలికి వచ్చి పరిస్థితి చూసి స్థిమిత పడ్డారు. వచ్చిన వాళ్ళు కాసేపు విందాం అని కూర్చునిపోయారు. ఈ విధంగా ఒక అరగంటకల్లా సుమారు ఒక వంద మంది శ్రోతలు శ్రీకాకుళానికి లభించారు.

తనకు తెలిసినవి వాళ్ళకి తెలియకుండా ఉండేలాగ ఒక గంట అప్పగించి 'శ్రీకాకుళం' తన ఉపన్యాసాన్ని ముగించాడు. ఇది శ్రోతలలో చాలా మందికి చక్కని ప్రహసనానందాన్నిచ్చింది. కొందరు నవ్వుకున్నారు. కొందరు గుసగుస లాడుకున్నారు. మరికొందరు సభ పూర్తి ఆవగానే శ్రీకాకుళం చుట్టూ ముసిరి తమ పుస్తకాల్లో సంతకాలు పెట్టమని ప్రాధేయపడసాగారు. అతి కష్టంమీద ఆ గండాన్ని తప్పించుకొని 'శ్రీకాకుళం' సభను పరిసమాప్తి చేశాడు. ఈ విధంగా రోజూ ఆ వార్డులో 'శ్రీకాకుళం' హరికేన్‌లైటు మీటింగులు ప్రతి వీధుల్లోనూ సాగుతున్నాయి. జనం విరివిగానే వచ్చేవారట! నేను మాత్రం ఆ రోజు తర్వాత వాడికి కనిపించడం మానేశాను, ఎక్కడ అధ్యక్షుడుగా ఉండవలసివస్తుందో అని.

ఎన్నికల ఫలితాలరోజు రాత్రివీధుల్లో హడావుడి విని ఇవతలికివచ్చి చూస్తే ఒక సైకిలు రిక్షాలో దండలతో మా 'శ్రీకాకుళం' ఊరేగుతున్నాడు. వాడికి జై కొట్టుకుంటూ సుమారొక వందమంది యువకులు ఉత్సవంలో నడుస్తున్నారు. నన్ను చూసి మా శ్రీకాకుళం మందహాసం చేశాడు...

ఒక రోజున మా యింట్లో పేపరు చూసుకుంటూ కూర్చున్న నాకు, మా యింటి ముందు ఒక చిన్న కారు ఆగిన

చప్పుడు వినిపించింది. పేపరు మడిచి వీధిలోకి చూద్దునుకదా కారు డ్రయివరు దిగివస్తూ "అయ్యా కారులో చైర్మన్ గారు మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు

ఆ రోజున చైర్మన్ ఎన్నిక అని గుర్తుకు వచ్చి "ఎవరు ఎన్నిక అయారు చెప్మా" అనుకుంటూ అలాగే నిలబడి పోయాను. ఇంతలో ఆ కారు తలుపులు తెరుచుకుని మా శ్రీకాకుళం నవ్వుతూ నాకేసి రాసాగాడు. డ్రైవరు చేతులు కట్టుకుని పక్కకు తప్పుకున్నాడు. నేను విస్తుపోయి అలాగే నిలబడిపోయాను.

'శ్రీకాకుళం' లోపలికి వచ్చి మంచం మీదికి చేతినంచీ క్రా విసిరి కళ్లజోడు తీసి టీపాయ్‌మీద ఉంచుతూ "అల్లా తెల్లబోతావేం? లోపలికిరా" అన్నాడు. నేను నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వాణ్ణి అనుసరించాను. కూచో అని నన్నొక కుర్చీలో కూర్చోపెట్టి తనింకో దాంట్లో కూచున్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

"కౌన్సిలరుఅయినందుకే ఆశ్చర్యపోతూంటే చైర్మన్‌కూడ అయ్యావేమిటి?" అన్నా.

అదంతా ఒకవిచిత్రమైనకథ. మొత్తం ఇరవై ముగ్గురం కౌన్సిలర్లం. అందులో పదకొండుగురు నాయుడుగారి పార్టీవాళ్లూ పదకొండుగురు పెద్దకాపుగారి పార్టీ వాళూనూ."

"అయితే దేనికీ చెందనివాడివి నువ్వొక్కడివే అన్నమాట.!"

"మరే — అందులోనూ వాళ్ళిద్దరి బలాలూ సమానంగా ఉన్నాయేమో కథ మరీ రక్తి కట్టింది."

"అవునవును. పైగా లక్షరూపాయ లిచ్చినా ఆ పార్టీలోవాడు ఈ పార్టీలోకి రాడు."

"అదే మనకి లాభించింది. ఏ పార్టీ వాడు చైర్మన్ కావాలన్నా మన ఓటు అవసరం అయింది. నా ఓటుకి పాట పెరిగింది. పదివేలదాకా పెరగనిచ్చి నేను డబ్బుకి కక్కుర్తిపడే రకంకాదని రెండు పార్టీలకీ ఖచ్చితంగా తెలియ చెప్పాను. దాంతో వ్యాపారం మరీ బిగిసింది. ఆఖరికి నన్ను చైర్మన్‌గా ఒప్పుకుంటాం అనీ, తమ పార్టీ మనిషిగా వ్యవహరించమనీ నాయుడుగారు ప్రత్యేకంగా వచ్చి ప్రార్థించడంతో ఒప్పుకోక తప్పిందికాదు."

"చాలా ఎత్తువే వేశావన్నమాట."

"ఎత్తులేమిటిరా నీ మొహం, నా కసలీ రెండు పార్టీలలో దేనితోటీ కలవడమూ ఇష్టంలేదు. ఎందుకు ఒప్పుకున్నానా అని ఇప్పుడు విచారిస్తున్నా."

"అదేమిటి?"

"అవును, వాళ్ళకి బుద్ధిలేకపోతే నాకేనా ఉండొద్దూ! అక్షరంముక్క రాని వాడిని నేను చైర్మన్ ఏమిటి? అందుకే నా గౌరవార్థం చేయబోతూన్న విందుకి వెళ్ళకుండా ఇక్కడికొచ్చా."



"నిజంగా నీలాంటి నిరాడంబరుడు ఉండటం చాలా అరుదు సుమా!" అన్నాను ఆశ్చర్యంతో అభినందిస్తూ.

"అదేమీ నువ్వు అనుకున్నంత గొప్ప విషయం కాదులే. అది సరేకాని ముందు ఈ ఛైర్మన్ పదవికి నా రాజీనామా రాయి. వేలుముద్ర వేస్తాను," అన్నాడు.

"అదేమిటి?" అన్నా.

"అంతేలే!"

"అదేం?"

"ఇంక ప్రశ్నలు వెయ్యకు. ఒక రోజున నువ్వు చెప్పినట్టు విన్నానా, ఇవాళ వినటానికి? ఊ — రాయి" అన్నాడు, శ్రీకాకుళం.

విధిలేక రాశాను వాడు వేలిముద్ర వేసి డ్రైవరు చేతికిచ్చి అది కౌన్సిలర్లకీ, కమీషనరుకీ అందజేయమన్నాడు. ఆ ఉత్తరాన్ని డ్రైవరు వినయ విధేయతలతో అందుకుని వెళ్ళిపోయాడు.

'శ్రీకాకుళం' మళ్ళీ పూర్వంలాగే క్రికెట్ విషయాలూ, అందులో తనకున్న పాండిత్యం మెళుకువలు గూర్చి నేను వినకపోయినా చెప్పుకుపోతూ మధ్య మధ్య కరిబీడీకి ఆరిపోకుండా పీలుస్తూ

న్నాడు. చేతికర్రా, కళ్ళజోడూ, లెదర్ బాగ్ ఈ మూడూ మంచంమీద పడి ఉన్నాయి. నేను వాటికేసి చూసి ఆలోచిస్తూ వాడి మాటలు వింటున్నట్టు నటిస్తున్నా.

ఇంతలో బిలబిలమంటూ పాతిక ముప్పయిమంది లోపలికి చొరబడ్డారు. నేను కంగారుగా లేచి నిలబడ్డాను. వాళ్ళంతా కౌన్సిలర్లూ, ఊళ్ళో పెద్దలూను వాళ్ళందరూ శ్రీకాకుళాన్ని బతిమాల సాగారు. ససేమిరా తన నిర్ణయానికి తిరుగులేదని శ్రీకాకుళం బిగిసిపోయాడు వాళ్ళు కాళ్ళా వేళ్ళా పడ్డారు. కాదూ కూడదన్నారు. ప్రార్థించారు. ప్రాకులాడారు. ఏమీ లాభం లేదన్నాడు, శ్రీకాకుళం.

తమలో తమకున్న వివాదాలవల్ల తమలో ఎవరూ ఛైర్మన్ అవడం కల్ల అన్నాడు. కనుక అందరికీ అంగీకార యోగ్యుడైన అతను ఛైర్మన్ పదవి స్వీకరించి నగర గౌరవాన్ని కాపాడాలన్నారు. అతను అంగీకరించకపోతే అసలు ఛైర్మనే ఉండకపోవడంకానీ తిరిగి ఎన్నికలు రావడంకానీ జరుగుతుందన్నారు. మొదటిదానివలన మునిసిపాలిటీ అపహాస్యం పాలవుతుందన్నారు, రెండవదానివల్ల కౌన్సిలరుగా ఎవరూ నిలబడకపోవడమనే మహా ప్రమాదం సంభవిస్తుందనీ, పట్నంలో ప్రశాంతత నశిస్తుందనీ అన్నారు.

"నేనింత గొడవ అవుతుందంటే అసలు నిలబడకే పోదును తెల్సా" అన్నాడు. శ్రీకాకుళం.

"హమ్మమ్మ... ఆ మాట అనకండి. ఈ ఛైర్మన్ పదవి మీరు అంగీకరించే దాకా మేం ఇక్కడనుంచి కదలం," అన్నారు వాళ్ళు.

అని, అక్కడే కూచుని సత్యాగ్రహం, మొదలెట్టారు.

కొంతసేపయాక "ఇదెక్కడి సంతయ్యా నాకుపదవి వద్దు మొర్రో అంటే వదలరేం?" అన్నాడు శ్రీకాకుళం

వాళ్ళలో ఎవరూ బెసకలేదు.

"పదవులు సీతాకోక చిలుకల్లాంటివిరా నాయనా. వెంటబడితే చిక్కవు, మనకెందుకని వచ్చికూర్చుంటే వాటంతట అవే వచ్చి మనమీద వాల్తాయి" అన్నాను. నేను, సాధ్యమైనంత నిర్లిప్త ధోరణిలో,

"మరయితే లే-నిన్ను నేను పి. ఏ. గా వేసుకుంటున్నాను. నీలాంటి చదువుకున్నవాడు దగ్గర లేకపోతే, ఆ ఛైర్మన్ పదవి నావల్ల ఏంఅవుతుంది?" అన్నాడు శ్రీకాకుళం చిరాగ్గా చేతికర్రా, సంచీ, కళ్ళజోడూ అందుకుంటూ, "చచ్చాం... ఈ సీతాకోక చిలుక నామీదవచ్చి వాలిందేమిటి?" అని తబ్బిబ్బు పడుతూంటే."

లేవండి పి. ఏ. గారూ, మీరు లేస్తేగానీ ఛైర్మన్‌గారు లేవరు'' అన్నారు కౌన్సిలర్లంతా ముక్తకంఠంతో కోరస్ పాడినట్లు...

— —